ఉత్సాహంగా సరస్వతి విద్యానికేతన్ స్కూల్ వార్షికోత్సవం


ఎమ్మెల్యే వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే

జియాగూడ: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించడం హర్షనీయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌కుమార్ అన్నారు. శనివారం ఎస్‌బీఏ గార్డెన్‌లో జియాగూడ సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే ఆధ్వర్యంలో ఏర్పాటైన 20వ స్కూల్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే సన్మానించి మెమెంటో అందజేశారు. అనంతరం విరించి హాస్పిటల్ చైర్‌పర్సన్ మాధవీలత మాట్లాడుతూ..చదువులో రాణించినప్పుడే అన్ని విధాలుగా ఎదుగుదలకు సాధ్యమవుతుందన్నారు. డైరెక్టర్ బాల్‌రాజ్ మాట్లాడుతూ..20 ఏళ్లుగా స్కూల్‌ను కొనసాగిస్తూ తక్కువ ఫీజులకే విద్యను అందిస్తూ అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అక్షదీప్ జూనియర్ కళాశాల డైరెక్టర్ మహ్మద్ అక్రమ్ అలీ, టీడీపీ అధ్యక్షులు కె.నర్సింగ్‌రావు, సంఘ సేవకుడు పీఎం రాజు, స్కూల్ ప్రిన్సిపాల్ సునేత్ర కౌలే, ట్రస్మా ఉపాధ్యక్షుడు బి.గాలయ్య, అక్రమ్‌బేగ్, మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. నానల్ నగర్ డివిజన్ హకీంపేట్, జాఫర్ హోటల్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న వీడీసీసీ రోడ్డు, పైప్‌లైన్‌ల పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పనులు పూర్తి కాకపోతే స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. పనులను సకాలంలో పూర్తి చేయని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించవద్దని తాను బల్దియా కమిషనర్‌ను కోరుతానన్నారు. అంతేకాకుండా పనుల కోసం తవ్విన ప్రదేశం వద్ద మట్టి కుప్పలను ఎప్పటికప్పుడు తరలించాలని ఆయన అన్నారు. దీని వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. రోడ్డు మరమ్మతులు జరుగుతున్న ప్రాంతాల్లో సైతం తాను పర్యటించి పనుల్లో నాణ్యత లోపించకుండా చూస్తున్నానన్నారు. ముందుగా దెబ్బతిన్న డ్రైనేజీ లైన్‌లు, మ్యాన్‌హోళ్లను మరమ్మతులు చేసి ఆ ప్రాంతాల్లో రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. నానల్‌నగర్ డివిజన్‌లోని ఇంకా ఎన్నో ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వీటన్నిటినీ సకాలంలో పూర్తి చేయిస్తానని ఆయన అన్నారు. రోడ్డు పనుల్లో భాగంగా జరుగుతున్న తవ్వకాల్లో తాగునీటి పైప్‌లైన్‌లు దెబ్బతినకుండా చూడాలని ఆయన అన్నారు. తవ్వకాల్లో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తాగునీరు వృథా కావడమేకాకుండా నీళ్ల సరఫరా కాకుండా ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. వీడీసీసీ రోడ్లు వేయడంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని రోడ్డు మీద ఉన్న విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ అధికారులతో తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. అదే విధంగా రోడ్డు విస్తరణ జరిగిన ప్రాంతాల్లో సైతం పాత విద్యుత్ స్తంభాలు తొలగించి కొత్తవి వేయాలని తాను అధికారులను కోరడం జరిగిందన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్, సయ్యద్ జబ్బార్, మజీద్ తదితరులున్నారు.

బీజేపీ పటిష్టతకు కృషి చేయాలి



గౌలిపురా: పాతబస్తీలో బీజేపీని మరింత పటిష్ట పరిచేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు ఆదర్శ మహేశ్ సూచించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శనివారం బీజేపీ సీనియర్ నాయకుడు, శక్తి కేంద్ర ప్రముఖ్ కొడి సురేందర్ ఆధ్వర్యంలో గౌలిపురా డివిజన్‌లోని కుమ్మర్‌వాడి, గాంధీనికేతన్ తదితర ప్రాంతాల్లో బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ..రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ ఓడించి బీజేపీ జెండాను ఎగరవేయాలని..దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ బూత్ అధ్యక్షులు, బీజేపీ నాయకులు బొట్టు వెంకట్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌లల్లాను దర్శించుకున్న బీజేపీ నేతలు



జియాగూడ: అయోధ్య రామ్‌లల్లాను దర్శించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని గోల్కొండ జిల్లా బీజేపీ డెయిరీసెల్ కన్వీనర్ బి.శివకుమార్‌యాదవ్, జియాగూడ బీజేపీ అధ్యక్షుడు జె.లక్ష్మీనారాయణ, అధికార ప్రతినిధి సతీష్ బిడ్లా అన్నారు. శనివారం అయోధ్యలోని రామ్‌లల్లాను దర్శించుకున్నారు. వారు మాట్లాడుతూ..హైదరాబాద్ నుంచి స్పెషల్ ట్రైన్ ద్వారా అయోధ్యకు చేరుకున్నామని, ఇందులో బీజేపీ అనుబంధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు మాణిక్‌ప్రభు, శివశంకర్, కిషన్‌దామ, రాహుల్‌బిడ్ల, భాస్కర్‌గుప్తా, సూరజ్ బిడ్ల తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో సైన్స్ ఎక్స్‌పో–2024


ప్రదర్శనలను తిలకిస్తున్న వి.రాజ్‌కుమార్

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ రవీంద్ర భారతి పాఠశాలలో శనివారం సెంటియా సైన్స్ ఎక్స్‌పో–2024 పేరిట ఏర్పాటు చేసిన వైజ్ఞాన్ని ప్రదర్శనశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన పరికరాలు ఆలోచింపజేస్తున్నాయని డీఆర్‌డీఓ సైంటిస్ట్ వి.రాజ్‌కుమార్ అన్నారు. విద్యార్థులు తమ మదిలోని ఆలోచనలను ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో తయారు చేసి ప్రదర్శించిన తీరు ఆలోచింపచేశాయన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో ఎల్‌కేజీ నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు కెమిస్ట్రీ ఎక్స్‌పరిమెంట్స్, ఫిజిక్స్ సంబంధిత మోడల్స్, చంద్రాయన్–3, సెక్రెటరియేట్ ఆఫ్ హైదరాబాద్, సెల్ఫీ కార్నర్ నమూన, హైడ్రో ఎలక్ట్రిక్ మోడల్స్, అక్వా కల్చర్ శాస్త్ర సంబంధిత నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ సి.నరేంద్రరెడ్డి, పీజీ అడ్మిషన్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.ప్రేమలతలతో పాటు రవీంద్రభారతి విద్యాసంస్థల డీన్ ప్రియామనీష్, ప్రిన్సిపాల్ నూరిన్ ఫాతిమా పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం


ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో ఉస్మాన్‌బిన్ మహ్మద్ అల్‌హాజరీ

గోల్కొండ: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజరీ అన్నారు. శనివారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లాతో కలిసి ఆసుపత్రి ఔట్ పేషంట్స్, కన్‌సల్టేషన్, ఇన్ పేషంట్ విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆయన ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉంటే తనకు తెలపాలని పోస్టుల భర్తీకి తాను కృషి చేస్తానన్నారు. ఆసుపత్రిలో మరిన్ని వైద్య విభాగాలు ఏర్పాటుతో పాటు వైద్యుల నియామకానికి కూడా తాను కృషి చేస్తానన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని తాను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళతానన్నారు.

నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం


ప్రొఫెసర్ యాదయ్యను సన్మానిస్తున్న గౌరీ సతీష్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ రాములు

అబిడ్స్: నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి వారి ఆశలను నిజం చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ సభ్యులుగా నియమితులైన ప్రొఫెసర్ యాదయ్యను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గౌరీ సతీష్ మాట్లాడుతూ..పదేళ్ల కేసీఆర్ పాలనకు నిరుద్యోగులు చరమ గీతం పాడారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులను నట్టేట ముంచిందన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం వారందరికీ ఉద్యోగాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ రాములు తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన సబ్జిమండి రెజ్లర్లు



గోల్కొండ: అత్యుత్తమ శిక్షణతో యువ రెజ్లర్లు తెలంగాణకే గర్వకారణంగా ఎదుగుతున్నారని సబ్జిమండి వీరాభిమన్యు వ్యాయామశాలకు చెందిన ప్రముఖ రెజ్లింగ్ కోచ్ కట్ట లింగం అన్నారు. రాష్ట్రస్థాయి అండర్–20 రెజ్లింగ్ పోటీల్లో వీరభిమన్యు వ్యాయామశాలలో శిక్షణ పొందిన రెజ్లర్లు హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. అండర్–20 రెజ్లింగ్‌లో కట్ట మణిశంకర్ 56 కేజీల విభాగంలో, కట్ట గణిశంకర్ 82 కేజీల విభాగంలో తదితరులు పతకాలు సాధించారు. శనివారం వీరిని సబ్జిమండి వీరాభిమన్యు వ్యాయామశాలలో వారిని ఘనంగా సన్మానించారు.

ఆంగ్లం రివర్స్ టైపింగ్‌లో రికార్డ్

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమాకు చెందిన హైకోర్టు అడ్వకేట్ షేక్ అష్రఫ్ ఆంగ్ల అల్ఫాబెట్స్(బ్యాక్‌వర్డ్స్)ను అతి తక్కువ సమయంలో టైప్ చేసి గిన్నీస్ బుక్ రికార్డ్ సాధించాడు. గతంలో 3.71 సెకండ్ల వ్యవధిలో ఉన్న ఈ రికార్డ్‌ను అష్రఫ్ కేవలం 2.82 సెకండ్లలో సాధించాడు. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు, కార్యదర్శి కట్ట ప్రదీప్ రావు, అడ్వకేట్ సయ్యద్ షఫిక్ ఉద్దీన్‌లు ఆయనకు అభినందనలు తెలియజేశారు.


రికార్డ్ సాధించిన అడ్వకేట్ షేక్ అష్రఫ్

సమాజ అభ్యున్నతికి కృషి



అబిడ్స్: వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో నిరంతరం పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సేవా సమితి నాయకుడు, గ్రేటర్ హైదరాబాద్ ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సీనియర్ నేత ఆనంద్ మర్పల్లి, వాసవి సేవా సమితి సభ్యుడు సతీష్‌కుమార్ తేలుకుంట పేర్కొన్నారు. పేద బడుగు వర్గాలకు తరచూ తమ సమితి ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ వారికి అండగా ఉంటున్నామన్నారు. వాసవి సేవా సమితి కార్ఖానా ఆధ్వర్యంలో అల్పాహారాలు, అన్నప్రసాదం, జ్యూస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సమాజ శ్రేయస్సుకు, సమాజ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామన్నారు. శ్రీనివాస్ మనిగండల తదితరులు పాల్గొన్నారు.

‘టీవీవీపీలో జోనల్ కౌన్సెలింగ్ నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నాం’


మాట్లాడుతున్న టీవీవీపీ జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ నర్సింగ్ ఉద్యోగుల జోనల్ లొకేషన్ ప్రక్రియలో భాగంగా శనివారం కోఠిలోని డీఎంహెచ్‌ఎస్‌లో పాత రెండు జోన్లలో పనిచేస్తున్న ఉద్యోగులను కొత్తగా ఏర్పడిన రెండు జోన్లకు విభజిస్తూ ప్లేసెస్ అలాట్‌మెంట్ చేయుటకు కౌన్సెలింగ్ నిర్వహించడంపై తెలంగాణ వైద్య విధాన పరిషత్ జేఏసీ చైర్మన్ డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ రావూఫ్, కన్వీనర్ సోమ మల్లన్న హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ..10 ఏళ్ల నుంచి ఈ లొకేషన్ ప్రక్రియ కానందునా వైద్య విధాన పరిషత్‌లో పని చేస్తున్న ఉద్యోగులు నేటి వరకు ప్రమోషన్లు లేక సతమతమవుతున్న తరుణంలో 10 నెలల నుంచి అన్ని సంఘాలు కలిసి టీవీవీపీ జేఏసీగా ఏర్పడ్డాయని వారు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కూడా ఎన్నో నివేదికలు ఇవ్వడం జరిగిందని, కానీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రక్రియ జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే జోనల్ లొకేషన్ ప్రక్రియను వేగవంతం చేసే దిశగా ఇప్పుడు ఉన్న ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఆదేశాలు జారీ చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. టీవీవీపీ జేఏసీ ప్రతినిధులు సత్యనారాయణరెడ్డి, మరియమ్మ, పాండు, వీరేష్‌బాబు, అమృతరావు, భూలక్ష్మి, శ్రీనివాస్, శైలజ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ


సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీంద్రనాయక్

సుల్తాన్‌బజార్: తెలంగాణ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడుతుందని వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. శనివారం తెలంగాణ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన సంవత్సర కేలండర్‌ను డీహెచ్ రవీంద్రనాయక్ ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సంఘాలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రాబర్ట్‌బ్రూస్, జె.అశోక్, సుదర్శన్‌గౌడ్, హమ్‌తుల్ హాజిల్, హన్మంతరావు, శ్రీనివాస్, శరత్, ఉదయ్‌ప్రసాద్, ప్రకాష్, లావణ్య, పద్మజ, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రూ.8 వేల కోట్లు కేటాయించడం హర్షణీయం


వెంకటేశ్

గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి బడ్జెట్‌లోనే బీసీల సంక్షేమానికి రూ.8 వేల కోట్లు కేటాయించడంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ విద్య, ఉపాధి, సాంకేతిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తుందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బీసీలను పట్టించుకోలేదని..వారికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బీసీలు అందరూ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని కోరుకుంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పేదలను ఆదుకోవాలి


ఆహార పదార్థాలు అందజేస్తున్న పంకజ్‌కుమార్ అగర్వాల్

చార్మినార్: ప్రభుత్వంతో కలిసి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సమాజంలోని పేదలను ఆదుకోవాలని హైదరాబాద్ కుంభమేళా అగర్వాల్ బంధు వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. శనివారం రికాబ్‌గంజ్‌లో పేదలకు ఆహార పదార్థాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇప్పటికీ సమాజంలో పేద, గొప్ప అనే అసమానతలున్నాయని..ఆర్థికంగా నిలదొక్కుకున్న వారు పేదలకు ఆర్థిక సహాయ సహకారాలు అందజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గౌలిపురా: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. పటేల్‌నగర్‌లో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కూడిన కేలండర్‌ను ఆవిష్కరించారు. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ..రాబోయే రోజుల్లో మరిన్ని వికసిత్ భారత్ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జమాల్‌పూర్ చంద్రశేఖర్, డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్, ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, కె.యాదయ్య, దొడ్డి శ్రీనివాస్, పి.రమేశ్ గురుస్వామి, ఎ.మహేందర్ గిరి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

హల్‌చల్ చేసిన రౌడీ షీటర్ల రిమాండ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న అదనపు డీసీపీ అశ్వాక్

నాంపల్లి: హబీబ్‌నగర్‌లో రౌడీషీటర్లు హల్‌చల్ చేశారు. మామూళ్లు ఇవ్వలేదని ఓ ఇంట్లోకి చొరబడి బీభత్సం సృష్టించిన ఘటన శుక్రవారం రాత్రి హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ మహ్మద్ అశ్వాక్ వివరాల ప్రకారం.. బేగంబజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పటేల్‌నగర్‌లో నివాసముండే రౌడీ షీటర్లు, ఇమ్రాన్ ఖాన్ (26), మహ్మద్ షరీఫ్ అలియాస్ మహ్మద్ అహ్మద్ (34) హబీబ్‌నగర్‌లో ఉండే మహ్మద్ సమీర్(30) ముగ్గురు శుక్రవారం రాత్రి దారుస్సలాం రోడ్డులోని సుభాన్‌పురాలో శ్మశాన వాటికలో కలిసి అర్ధరాత్రి దాకా మద్యం తాగారు. అనంతరం యుసుఫియన్ దర్గా సమీపంలోని జనానీ గేటు వద్దకు వచ్చి అక్కడ తమ దగ్గర ఉన్న కత్తులను బయటకు తీసి హంగామా చేశారు. అంతటితో ఆగకుండా ఓ పూల వ్యాపారి ఇంట్లోకి దూరి మామూళ్లు ఇవ్వాలని లేకుంటే కత్తులు చూపి చంపుతామని బెదిరించి ఇద్దరిపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు శనివారం రాత్రి 12 మంది రౌడీషీటర్లను స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. దౌర్జన్యాలు, దాడులకు పాల్పడొద్దని జాగ్రత్తగా ఉండకుంటే జైలుకు పంపుతామని అదనపు డీసీపీ మహ్మద్ అశ్వాక్ హెచ్చరించారు.

సన్మానం



బల్మూరి వెంకట్‌ను సన్మానిస్తున్న కార్తీక్

అబిడ్స్: ఎన్‌ఎస్‌యూఐ నగర కార్యదర్శి జె.కార్తీక్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను శనివారం సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు అండగా నిలిచిందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉండి పలువిధాల సహకారం అందిస్తుందన్నారు.

మాడిఫైడ్ సైలెన్సర్లు బిగిస్తే కఠిన చర్యలు

అబిడ్స్: బుల్లెట్ వాహనాలకు మాడిఫైడ్ సైలెన్సర్లను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మాడిఫైడ్ సైలెన్సర్లు బిగించిన పలువురి వద్ద సైలెన్సర్లను సీజ్ చేశారు. ఎంవీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి ఫైన్ వేశామన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ..ప్రతిరోజూ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా స్పెషల్ డే నిర్వహిస్తున్నామన్నారు. మాడిఫైడ్ సైలెన్సర్లు ఏర్పాటు చేస్తే ఆ వాహనాలు సీజ్ చేస్తామన్నారు.

పిల్లల్లో ఆధ్యాత్మిక భావం పెరగాలి



గోల్కొండ: పిల్లల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందితే వారు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని వీనస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మహ్మద్ ఇదాయత్ ఆలీఖాన్ అన్నారు. శనివారం టోలిచౌకి డీసెంట్ కాలనీలోని వీనస్ హై స్కూల్‌లో రాహె హిదాయత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రుజుమార్గం వైపు పయనించేందుకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పిల్లలు ఖురాన్‌లోని పలు అంశాలపై విశ్లేషించారు. ఈ సందర్భంగా మహ్మద్ ఇదాయత్ ఆలీ ఖాన్ మాట్లాడుతూ..పిల్లలకు చిన్నతనం నుంచే మానవత విలువలతో పాటు సమాజ సేవ విషయాలపై వివరిస్తుండాలని అన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు ఆయన మెమెంటోలు అందజేశారు. ఉపాధ్యాయ బృందంతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రమణీయం..అంజలి నృత్య రూపకం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య శిక్షణాలయం దీపాంజలి కూచిపూడి పాఠశాల ఆధ్వర్యంలో నృత్యగురువు దీపికారెడ్డి శిష్యురాలు అంజలిరెడ్డి కూచిపూడి రంగప్రవేశం శనివారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా గణేష పంచరత్నం, గౌరీ సుకుమారి, శివ శివ భవ, వచ్చేను అలవేలు మంగ, థిల్లాన వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శాసన సభ్యురాలు ఎస్.పద్మావతిరెడ్డి, నల్సార్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవారాయ్, పద్మశ్రీ ఆనంద్‌శంకర్ జయంత్, సినీ నిర్మాత దిల్‌రాజ్, కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత దీపికారెడ్డిలతో పాటు తల్లిదండ్రులు, నాట్య ప్రియులు పాల్గొన్నారు.

శివబాగ్ శివ మందిర్‌లో సుందరకాండ పారాయణం



అబిడ్స్: గుడిమల్కాపూర్ శివబాగ్ శివ మందిర్‌లో సుందరకాండ పారాయణం నిర్వహించారు. శనివారం రాత్రి చార్‌మహల్ రామాయణ్ మండల్ ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణం చేపట్టారు. భజనలు, భక్తి గీతాలతో అలరించారు. 1.25 కోట్ల గళ్ల రామకోటి హనుమాన్ ఛాలీసా పుస్తకాన్ని భక్తులకు అందజేశారు. ఈ వేడుకల్లో మహేష్‌నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పట్నం సుబ్బారావు, ముల్లే రాకేష్, గౌరిగే శ్రీనివాస్, రఘు, కిశోర్‌గుప్తా, భాస్కర్ పాల్గొన్నారు.